సాక్షి వికారాబాద్

సోమవారం, 1, ఏప్రిల్, 2024



కాసుల వేట..

కాసులు దండుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్న మెడికల్ షాపుల నిర్వాహకులు నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. 8లో▸



హర్షణీయం

గోశాల సేవా సమితి నిర్వహించిన గరుకు స్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. 8లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : సోమవారం సాయంత్రం 6:35

సహర్ : మంగళవారం ఉదయం 4:48

న్యూస్‌రీల్

నేడు స్పీకర్ ఇఫ్తార్ విందు

బంట్వారం: అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సోమవారం వికారాబాద్ పట్టణంలోని చిగుళ్లపల్లి మైదానంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు తరలిరావాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అయూబ్ అన్సారీ కోరారు. ఆదివారం ఆయన బంట్వారం మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశ్‌తో కలిసి తొర్మామిడి తదితర గ్రామాల్లో పర్యటించి ముస్లింలను ఇఫ్తార్ విందుకు ఆహ్వానించారు. ఇఫ్తార్ విందుకు కులమతాలకు అతీతంగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశం, నాయకులు నర్సింహారెడ్డి, నర్సింహులు, శ్రీనివాస్, సిద్ధిరాములు స్వామి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రజా ఆశీర్వాద యాత్ర

తాండూరు: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి సోమవారం నుంచి తాండూరు నియోజకవర్గంలో ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహించనున్నారని ఆ పార్టీ స్థానిక నేతలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. యాలాల మండలంలోని రాస్నం గ్రామం నుంచి ప్రారంభించే యాత్ర తొలిరోజు యాలాల మండలంతో పాటు బషీరాబాద్ మండలంలోని జీవన్గి గ్రామం వరకు కొనసాగనుంది. మరుసటి రోజు తాండూరు, పెద్దేముల్ మండలాల్లో ప్రచారం నిర్వహిస్తారని నేతలు తెలిపారు. కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి

- మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్



పూజలో మున్సిపల్ చైర్మన్ అశోక్ కుమార్ తదితరులు

పరిగి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని మున్సిపల్ చైర్మన్ అశోక్ కుమార్ అన్నారు. ఆదివారంమండల పరిధిలోని కల్లాపూర్ లొంక అంబాభవానీ ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. యువత సంపాదనతో పాటు భక్తిభావాన్ని అలవర్చుకోవాలని, సంపాదించిన దానిలో కొద్ది భాగం ఆధ్యాత్మిక, నిరుపేదల కోసం ఖర్చు చేయాలన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకుని మొక్కుల తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్‌రెడ్డి, మహేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్‌రూరల్: తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల వికారాబాద్ మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ విద్యార్థినులకు ఇంగ్లిష్ బోధన కోసం పార్ట్‌టైమ్ ప్రాతిపదికన లెక్చరర్‌గా పని చేసేందుకు ఆసక్తి గల మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌శర్మ పేర్కొన్నారు. అభ్యర్థులు సంబంధిత పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులు కలిగి ఉండాలని, పీహెచ్‌డీ, నెట్‌సెట్ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులకు సర్టిఫికెట్ కాపీలను జత చేసి ఈ నెల 3వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు మొయినాబాద్ మండలం తోల్‌కట్ట సమీపంలోని వికారాబాద్ డిగ్రీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో అందజేయాలని చెప్పారు. స్క్రీనింగ్ టెస్ట్ డెమో ద్వారా ఉద్యోగ నియామకం ఉంటుందన్నారు. మరింత సమాచారం కోసం 95810 92637 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రంగారెడ్డి జిల్లా మాస్ మీడియా అధికారికి సన్మానం



గజమాలతో నరహరి దంపతులను సన్మానిస్తున్న అధికారులు

షాద్‌నగర్: వైద్య ఆరోగ్యశాఖలో మాస్ మీడియా రంగారెడ్డి జిల్లా అధికారిగా పని చేస్తున్న నరహరి ఆదివారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో సన్మానోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులుతో పాటు వైద్య సిబ్బంది తరలివెళ్లారు. నరహరి దంపతులకు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

ఓటరును చేరేదెలా..?

పల్లెల్లో ప్రారంభంకాని లోక్‌సభ ఎన్నికల ప్రచారం

- పెద్దగా ఆసక్తి చూపని ఎమ్మెల్యేలు, కేడర్
- అభ్యర్థులు వచ్చినప్పుడే హడావుడి
- ఓటరు వద్దకు ఎలా వెళ్దామా అని మల్లగుల్లాలు

వికారాబాద్: ఎన్నడూ లేనివిధంగా లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థులు వింత అనుభవం ఎదుర్కొంటున్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు వేరువేరుగా జరుగుతుండటమే దీనికి ప్రధాన కారణం. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గత అసెంబ్లీ ఎన్నికలకు మూడు నెలలు ముందు(2018 డిసెంబర్)గా వెళ్లిన విషయం తెలిసిందే. దీంతో 2019 ఏప్రిల్‌లో రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలతో సంబంధం లేకుండా లోక్‌సభ ఎన్నికలు సపరేటుగా నిర్వహించింది ఈసీ. ఈసారి కూడా అదే ఆనవాయితీ పాటిస్తోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో మరోసారి ఎమ్మెల్యే అభ్యర్థుల సహకారం లేకుండానే ఎంపీ అభ్యర్థులు నేరుగా ప్రచారంలో పాల్గొనాల్సి వస్తోంది. దీంతో ప్రచార పర్వంలో ఎలా ముందుకు వెళ్లాలో తెలియక అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. ప్రధాన పార్టీలకు క్షేత్రస్థాయిలో కేడర్ ఉన్నప్పటికీ.. వారు అభ్యర్థులు ప్రచారానికి వచ్చినప్పుడే హల్‌చల్ చేస్తున్నారు తప్ప మిగతా సమయాల్లో ఎలాంటి ప్రచారం చేయటంలేదు. దీంతో గ్రామాల్లో ఎన్నికల వాతావరణమే కనిపించటంలేదు.

కార్యకర్తలను దాటని ప్రచారం..

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వచ్చి పదిరోజులు దాటినప్పటికీ ఏ ఒక్క గ్రామంలోనూ ఎన్నికల వాతావరణం కనిపించటంలేదు. ప్రధాన పార్టీలైన బీజేపీ తరపున కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ తరపున కాసాని జ్ఞానేశ్వర్ బరిలో ఉన్నారు. కాంగ్రెస్ తరపున ఇటీవల బీఆర్‌ఎస్ పార్టీని వీడిన సిట్టింగ్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. వీరిలో రంజిత్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని నియోజకవర్గాల్లో ఇప్పటికే సుడిగాలి పర్యటనలు చేశారు. కార్యకర్తలతో సమావేశమై కేడర్‌లో జోష్ నింపే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. బీజేపీ అభ్యర్థి కొండా ఆ పార్టీ నాయకులను కలవటం, విలేకరుల సమావేశాలు పెడుతూ తమ పార్టీ సిద్ధాంతాలను వివరించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే పార్టీ ఏదైనా... అభ్యర్థి ఎవరైనా ఇప్పటి వరకు వారి ప్రచారాలు కార్యకర్తలను దాటి ఓటర్ల దగ్గరకు వెళ్లలేదు.ఎమ్మెల్యేలతో పోలిస్తే ఎంపీ అభ్యర్థుల పరిధి ఎక్కువగా ఉండటంతో గ్రౌండ్ లెవల్లో ఓటర్లను చేరుకోవడం కోసంకష్టాలు పడుతున్నారు.

కేడర్ ఢీలా..

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎంతో కసితో పనిచేసిన ప్రధాన పార్టీల కేడర్.. లోక్‌సభ ఎన్నికలు వచ్చేసరికి ఢీలా పడిపోయింది. అభ్యర్థులు వచ్చినపుడే హల్‌చల్ చేస్తున్న కార్యకర్తలు, స్థానిక నేతలు మిగతా సమయంలో మిన్నకుండిపోతున్నారు. కనీసం ఓటరును కలిసే ప్రయత్నం కూడా చేయటంలేదు. అభ్యర్థులు లేకుండా ఇప్పటివరకు ఏ ఒక్క గ్రామంలో కూడా పార్టీ కేడర్, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రచారానికి ఉపక్రమించలేదంటే ప్రచారం విషయంలో అభ్యర్థుల పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

అభ్యర్థుల్లో ఆందోళన

స్థానిక కేడర్ నిర్లిప్తత ప్రధాన పార్టీల అభ్యర్థులను ఆందోళనకు గురిచేస్తోంది. ఓటర్ల వరకు ఎలా వెళ్దాం..మన అభ్యర్థన వారిచెంతకు ఎలా చేర్చుదాం అని వారు సతమతమవుతున్నారు. డబ్బులు ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నా.. మాస్ మీటింగ్‌లు, కార్యకర్తల సమావేశాలు చేసినా... తమ అభ్యర్థిత్వాన్ని ఓటరు దగ్గరకు తీసుకెళ్లే ప్రక్రియ ఎలా అనే విషయం ఇప్పుడు అభ్యర్థులను కలవరపరుస్తోంది. మొత్తానికి అసెంబ్లీ ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికలు ఒకేసారి జరగకపోవటం పెద్ద సమస్యనే తెచ్చిపెట్టాయని నేతలు తలలు పట్టుకుంటున్నారు. రానున్న రోజుల్లో ఎలాగైనా కేడర్‌లో జోష్ నింపడంతో పాటు తమ ప్రచారాన్ని క్షేత్రస్థాయిలో తీసుకెళ్లాలని, ఓటర్లను కలిసి తమ అభ్యర్థనను వివరించాలని అభ్యర్థులు ప్రణాళికలు రచిస్తున్నారు.



ఇమాన్యుయెల్ చర్చిలో మాట్లాడుతున్న ప్రసాద్‌కుమార్

ఏసు జీవితం ఆదర్శం

- అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని పలు చర్చిల్లో ఆదివారం నిర్వహించిన ఈస్టర్ వేడుకల్లో క్రైస్తవ సోదరులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వికారాబాద్ ఏజీ ఇమాన్యుయెల్ చర్చిలో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. ఏసు జీవితం అందరికీ ఆదర్శమని, ఆయన చూపిన శాంతి సందేశం అందరికీ చేరవేయాలన్నారు. ప్రపంచంలో శాంతిని మించిన సందేశం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్‌కుమార్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రమేష్‌కుమార్, పాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇఫ్తార్ విందు

- హాజరైన స్పీకర్, ప్రముఖులు

తాండూరు: తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పట్టణంలోని క్లాసిక్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఈ విందుకు ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు రమేష్ హాజయ్యారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఖర్జూరా పండ్లను తినిపించి ఉపవాస దీక్షలను విరమింపజేశారు. అనంతరం నేతలంతా కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.



ఇఫ్తార్ విందులో ప్రసాద్‌కుమార్, మనోహర్‌రెడ్డి, నాయకులు

ఉద్యోగ విరమణ సహజం



కృష్ణ దంపతులకు జ్ఞాపిక అందజేస్తున్న డీఎఫ్ఓ జ్ఞానేశ్వర్

డీఎఫ్ఓ జ్ఞానేశ్వర్

ధారూరు: ధారూరు ఫారెస్టు ఇన్‌చార్జి రేంజర్ కృష్ణ పదవీ విరమణ సందర్భంగా శనివారం రాత్రి ధారూరులోని శుభం ఫంక్షన్‌హాల్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఫారెస్టు అధికారి జ్ఞానేశ్వర్ పాల్గొని మాట్లాడుతూ.. విధి నిర్వాహణలో మీకు ఎదురైన సవాళ్లు, పరిష్కార మార్గాలు, అనుభవాలను మా సిబ్బందితో పంచుకోవాలని కోరారు. అంచెలంచెలుగా రేంజ్ అధికారి స్థాయికి ఎదిగారని.. రిటైర్‌మెంట్ తర్వాత శేష జీవితాన్ని ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు. ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ సహజం అన్నారు. అనంతరం కృష్ణ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎఫ్ఆర్ఓ జగన్మోహన్, సెక్షన్ ఆఫీసర్లు రాజేందర్‌రెడ్డి, మొయినొద్దీన్, బీట్ ఆఫీసర్లు నరేశ్, ఆనంద్, ఫారెస్టుసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధారూరు ఇన్‌చార్జిగా అరుణ..

ధారూరు: ధారూరు ఫారెస్టు రేంజ్ ఇన్‌చార్జి ఆఫీసర్‌గా వికారాబాద్ ఫారెస్టు రేంజర్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న అరుణకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. ఇన్నాళ్లు ఇన్‌చార్జి ఎఫ్ఆర్ఓగా కొనసాగిన కృష్ణ పదవీ విరణమ పొందటంతో ఏర్పడిన ఖాళీని పూర్తిచేశారు.

భానుడి ఉగ్రరూపం

- ఆరెంజ్ జోన్‌లోకి జిల్లా
- తాండూరులో అత్యధికంగా 41.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి



పెరిగిన ఉష్ణోగ్రతలతో కూలర్ షాపుల వద్ద కొనుగోలుదారుల సందడి

తాండూరు: మార్చి నెల ముగిసే నాటికే భానుడు ఉగ్రరూపం దాల్చాడు. వారం రోజుల క్రితం వరకు ఎల్లో జోన్‌లో ఉన్న జిల్లాలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరిగిపోయాయి. పలు మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు తోడు వాయు కాలుష్యం జిల్లా ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. రానున్న రోజుల్లో మరింత ఉష్ణోగ్రతలు పెరిగి రెడ్‌జోన్‌లోకి వెళ్తే ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఆరోగ్య శాఖ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ఉక్కపోత..

వికారాబాద్ జిల్లాలోని తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లో రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఉక్కపోతతో జనం అల్లాడిపోతున్నారు. దీనికి తోడు వారం రోజుల నుంచి ఎండలు దంచి కొడుతున్నాయి. మార్చి నెల ముగిసే నాటికి జిల్లాలోని 7 మండలాల్లో 40 డిగ్రీల పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ఆయా మండలాలు ఆరెంజ్ జోన్‌లోకి వెళ్లాయి. వాతావరణ శాఖ నాలుగు విభాగాల్లో ఉష్ణోగ్రతలను లెక్కకడుతుంది. 35 డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు నమోదైతే గ్రీన్ జోన్‌గా, 35–40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదైతే ఎల్లో జోన్‌గా, 40–45 డిగ్రీలలోపు నమోదైతే ఆరెంజ్ జోన్‌గా పరిగణిస్తారు. 45 డిగ్రీలపైగా ఉష్ణోగ్రతలు నమోదైతే రెడ్‌జోన్‌గా పరిగణిస్తారు. ఆదివారం వాతావరణ శాఖ విడుదల చేసిన ఉష్ణోగ్రతల్లో జిల్లాలోని తాండూరు 41.6, పూడూర్ మండలం 40.8 డిగ్రీలు, యాలాల 40.7 డిగ్రీలు, మోమిన్‌పేట్ 40.6 డిగ్రీలు, కోట్‌పల్లి మండలం 40.5 డిగ్రీలు, మర్పల్లి మండలంలో 40.5 డిగ్రీలు, కుల్కచర్లలో 40.1 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగిలన మూడు మండలాల్లో దాదాపు 38 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ వేడిమి నేపథ్యంలో పట్టణంలోని కూలర్ల దుకాణాల వద్ద అమ్మకాలు ఊపందుకున్నాయి. కూలర్లతోనైనా కాసేపు ఎండనుంచి ఉపశమనం పొందాలని ప్రజలు కొనుగోలుకు ఆశక్తిచూపుతున్నారు.

మైనింగ్‌తో వాతావరణంలో మార్పు...

జిల్లాలోని తాండూరు, పెద్దేముల్, యాలాల, బషీరాబాద్, మర్పల్లి, మోమిన్‌పేట్, పూడూర్ ప్రాంతాల్లో అడ్డగోలుగా మైనింగ్ చేపడుతున్నారు. ప్రకృతికి విఘాతం కలిగించే విధంగా చేపడుతున్న ఈ మైనింగ్ వల్ల వాతావరణంతో వేడి ఎక్కువవుతోందని పర్యావరణవేత్తలు అంటున్నారు. అలాగే తాండూరు ప్రాంతంలో నాపరాతి నిక్షేపాలు అధికంగా ఉండటంతో పాటు సిమెంట్ కర్మాగారాలున్నాయి. వీటి కారణంగా మరింత వేడి పెరుగుతోంది. పెద్దేముల్ మండలంలోని అటవీ ప్రాంతంలో వృక్ష సంపదను ధ్వంసం చేసి సుద్ద, ఎర్రమట్టి తవ్వకాలు జోరుగా సాగిస్తున్నారు. దీంతో తాండూరు ప్రాంతంలో వాతావరణం వేడెక్కుతోంది. ఇది ఇలాగె కొనసాగితే మరో దశాబ్ద కాలంలో తాండూరు ప్రాంతంలో వాతావరణం మరింత వేడిగా మారడం ఖాయమని పర్యావరణవేత్తలు అంటున్నారు. వెంటనే మైనింగ్‌ను అరికట్టాలని, వృక్షాలను నరకకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

జిల్లా అభివృద్ధికి ఏం చేశారు?



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

- రాహుల్ గాంధీ పేరెత్తకుండా నేను ప్రచారం చేస్తా
- మోదీ పేరెత్తకుండా నువ్వు ప్రచారం చేస్తావా?
- బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి రంజిత్‌రెడ్డి ప్రతిసవాల్
- తాండూరు కార్యకర్తలతో సమావేశం

తాండూరు: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ పేరును ప్రస్తావించకుండా ముందుకెళ్లేందుకు సిద్ధమా అని బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విసిరిన సవాల్‌ను తాను స్వీకరిస్తానని.. ఆయన ప్రధాని మోదీ పేరు ప్రస్తావించకుండా ప్రచారానికి వెళ్లేందుకు సిద్ధమా అని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి ప్రతి సవాల్ విసిరారు. తాండూరు పట్టణంలోని క్లాసిక్ గార్డెన్‌లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన రంజిత్ రెడ్డి మాట్లాడుతూ... బీజేపీ అభ్యర్థి కొండా ఏది నోటికి వస్తే అది మాట్లాడుతున్నారని విమర్శించారు. గతంలో ఇక్కడ నుంచి ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన కొండా వికారాబాద్ జిల్లా అభివృద్ధికి ఏం చేశారో చెప్పాలన్నారు. ఆయనకు పార్టీలు మారడంపై ఉన్న శ్రద్ధ స్థానిక సమస్యలను పరిష్కరించడంపై లేదన్నారు. నేను ఎంపీగా ఉన్న ఐదేళ్ల కాలంలో కొంతవరకైనా ఈ ప్రాంతానికి, ఈ ప్రాంత ప్రజలకు న్యాయం చేశానన్నారు. భవిష్యత్‌లో ఈ ప్రాంతఅభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు. డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. చేవేళ్ల పార్లమెంట్ స్థానం గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. తాండూరు ప్రజలు తనను కాంగ్రెస్ పార్టీలో చేరిన 35 రోజుల వ్యవధిలో ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. అలాగే రంజిత్‌రెడ్డిని కూడా ఇక్కడి నుంచి గెలిపించి రాహుల్ గాంధీకి కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత, తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, డీసీసీబీ డైరెక్టర్లు లక్ష్మారెడ్డి, రవిగౌడ్, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడ్, రాష్ట్ర నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, కౌన్సిలర్లు ప్రభాకర్‌గౌడ్, నీరజ, రత్నమాల, వెంకన్నగౌడ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిప్పే.. ముప్పే



కాటేదాన్‌లోని ఓ పరిశ్రమలో అగ్ని ప్రమాదంతో వెలువడుతున్న దట్టమైన పొగ (ఫైల్)

- భగ్గున మండుతున్న ఎండలు
- పెరుగుతున్న అగ్నిప్రమాదాలు
- తరచూ వెలుగుచూస్తున్న ఘటనలు
- పెద్ద ఎత్తున ఆస్తినష్టం
- ప్రాణాల మీదికి తెస్తున్న నిర్లక్ష్యం
- ఇళ్ల మధ్యే స్క్రాప్ గోదాంలు.. రసాయన పరిశ్రమలతో భయంభయం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎండలు భగ్గున మండుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల వరకు నమోదవుతోంది. చెట్లు ఆకులు రాలుతున్నాయి. రాలిన ఆకులను, పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ కవర్లను ఒకచోట కుప్పగా పోసి తగలబెడుతుండటంతో పాటు ఆయా సంస్థల్లో పని చేస్తున్న సిబ్బంది బీడీ, సిగరెట్ తాగి పీకలను వాటిలో పడేస్తుండడంతో మంటలు అంటుకుంటున్నాయి. ఉక్కపోత నుంచి ఉపశమనం కోసం ఏసీలు, కూలర్లు ఆన్ చేయడం, సామర్థ్యానికి మించి విద్యుత్‌ను వినియోగిస్తుండటంతో షార్ట్‌సర్క్యూట్ తలెత్తి అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో మంటలు ఆర్పేందుకు అనువైన వ్యవస్థ అందుబాటులో లేకపోవడంతో ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకునే లోపే ఆస్తులు బుగ్గి అవుతున్నాయి. కొన్ని సంస్థల్లో అగ్ని మాపక వ్యవస్థ ఏర్పాటు చేసుకున్నా నిర్వహణ లోపాలతో పని చేయడం లేదు. స్క్రాప్ దుకాణాలు, టింబర్ డిపోలు, సినిమా హాళ్లు, హోటళ్లు, ఫంక్షన్ హాళ్లు, ప్లాస్టిక్ పరిశ్రమలు, వాణిజ్య భవన సముదాయాల్లో ప్రమాదాలు ఎక్కువగా వెలుగు చూస్తున్నాయి.

నిర్వహణ సరిగా లేకే..

జిల్లాలో హయత్‌నగర్, మహేశ్వరం, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్, మాదాపూర్, చేవెళ్లలో ఫైర్ స్టేషన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 2021–22లో 382 అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. రూ.32.18 కోట్ల ఆస్తినష్టం వాటిళ్లింది. 26 మంది మృత్యువాత పడ్డారు. శేరిలింగంపల్లి, కాటేదాన్, హయత్‌నగర్, చేవెళ్ల, షాద్‌నగర్, శంషాబాద్ లోనే అత్యధిక ప్రమాదాలు వెలుగు చూశాయి. అగ్నిమాపక కేంద్రాలకు 2023లో 3,151 ఫోన్‌కాల్స్ రాగా, 2024లో 2,550 కాల్స్ వచ్చాయి. గత ఏడాది అగ్నిమాపక శాఖ నుంచి 3,060 ఆస్పత్రులు, విద్యా సంస్థలు, పరిశ్రమలు, షాపింగ్ మాల్స్ నిరంభ్యంతర పత్రాలు పొందాయి. వీటిలో అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేసినప్పటికీ మెజార్టీ భవనాల్లో నిర్వహణ మరిచి పోయారు. తరచూ ఇంట్లో వెలుగు చూసే ప్రమాదాలకు రిఫ్రిజిరేటర్, ఓవెన్, గ్యాస్ లీకేజీలు కారణమవుతుంటే.. స్క్రాప్‌గోదాములు, టింబర్ డిపోలు, ప్లాస్టిక్ పరిశ్రమల్లో వెలుగు చూసే ప్రమాదాలకు కార్మికులు పీల్చి వదిలేసే బీడీ, సిగరెట్ ముక్కలు కారణమవుతున్నాయి. చాలా పరిశ్రమల్లో ఫైర్ అలారం పని చేయడం లేదు. ట్యాంకుల్లో సరిపడా నీళ్లు ఉండటం లేదు. సిలిండర్లలో రసాయనాలు కన్పించడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో మంటలను ఆర్పేందుకు విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది యత్నించినా ఉపయోగం ఉండటం లేదు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతోంది.

నివారణ చర్యలే రక్ష



పరిశ్రమల్లో అగ్నిమాపక వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు మంటలు ఆర్పే పరికరాలను నిత్యం చెక్ చేసుకోవాలి. విద్యుత్ వైరింగ్, ఉపకరణాలు, స్విచ్‌లను పరిశీలించి లోపాలుంటే సరిచేసుకోవాలి. అతుకులు ఉన్న విద్యుత్ తీగలు ఉపయోగించొద్దు. మంటలు వ్యాప్తి చెందకుండా నివారణ చర్యలు తీసుకోవాలి.

– శ్రీనివాసరావు, సీఈజీ

క్లుప్తంగా

తండాల్లో ఎక్సైజ్ దాడులు

నాటు సారా, బెల్లం పానకం స్వాధీనం



బెల్లం పానకం ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

దౌల్తాబాద్: కొడంగల్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మండలాల్లోని ఆయా పంచాయతీ తండాల్లో ఆదివారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఇందులో మౌసమ్మగడ్డతండా, బోజన్నతండా, బుర్రితండా, నంద్యానాయక్ తండా, ఎల్‌జీతండా, కిష్యానాయక్‌తండాల్లో దాడులు నిర్వహించి 13 లీటర్ల సారా, 800 లీటర్ల బెల్లం పానకం స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వాటిని ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో కేసులు నమోదు చేసి ఇందులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వెంకటేశ్ తెలిపారు. ఎవరైనా నాటుసారా అమ్మినా తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తనిఖీల్లో రూ.1.68 లక్షలు పట్టివేత



స్వాధీనం చేసుకున్న నగదుతో పోలీసులు

దౌల్తాబాద్: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మండలంలోని చంద్రకల్ గ్రామంలో అంతర్రాష్ట్ర రాహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఆదివారం రూ.1.68 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. కర్ణాటక నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారును పోలీసులు తనిఖీ చేస్తుండగా ఎలాంటి పత్రాలు లేకుండా నగదు దొరికినట్లు సీఐ చెప్పారు. ఈ నగదును కలెక్టరు ట్రెజరీకి పంపిస్తామని ఎన్నికల కోడ్ అనంతరం నగదుకు సంబంధించి రసీదులు ఉంటే అందజేస్తామని తెలిపారు. రూ.50వేల కంటే ఎక్కువ నగదు తరలిస్తే కేసు నమోదు చేసి సీజ్ చేస్తామని సీఐ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీశైలంయాదవ్ తదితరులున్నారు.

స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: వికారాబాద్‌లోని ఏకేఆర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ప్రచురించిన డీఎస్సీ మెటీరియల్‌ను ఆదివారం వికారాబాద్ పట్టణంలో అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్టడీ సర్కిల్ డైరెక్టర్ రమణ, మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్‌కుమార్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మైపాల్‌రెడ్డి, కౌన్సిలర్ గాయత్రి, సీనియర్ నాయకులు నరోత్తంరెడ్డి, అరుణ్‌కుమార్, లక్ష్మణ్ గుప్తా, రెడ్యా నాయక్, సందీప్, ప్రదీప్ పాల్గొన్నారు.

బ్యాగరి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సత్తయ్య



కందుకూరు: తెలంగాణ మాల, బ్యాగరి కాటి కాపర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కందుకూరుకు చెందిన గాదె సత్తయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడిగా గాదె మల్లేశ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గాదె కుమార్‌లను ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు చెన్నకేశవులు ఆదివారం నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాల బ్యాగరుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు.

కాసుల వేట.. నిబంధనలు పట్టవట!

ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. కాసుల వేటలో పడి అలాంటి ఆరోగ్యానికి హాని కలిగించేలా మెడికల్ దుకాణాల నిర్వాహకులు వ్యవహరిస్తున్నారు. ఫార్మసిస్టులు లేకుండా విక్రయాలు, కాలం చెల్లిన మందులతో ప్రజల ఆరోగ్యాన్ని ప్రశ్నార్థకంగా చేస్తున్నారు.

- మెడికల్ దుకాణదారుల ఇష్టారాజ్యం
- ఫార్మసిస్టులు లేకుండానే మందుల విక్రయాలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



దోమలో మెడికల్ దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)

పరిగి: కాసులు దండుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్న మెడికల్ షాపుల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. నిర్వాహకులు ఇష్టారీతిగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. పరిగి నియోజకవర్గంలో వందలోపు మెడికల్ దుకాణాలు కొనసాగుతున్నాయి. నిబంధనల ప్రకారం మెడికల్ దుకాణాల్లో ఫార్మసిస్టుల సమక్షంలోనే మందులను విక్రయించాల్సి ఉండగా చాలా చోట్ల దీనికి విరుద్ధంగా చేస్తున్నారు. విద్యార్హత లేని వ్యక్తులతో మందులు విక్రయిస్తూ ప్రజల ప్రాణాలను గాల్లో దీపంలా పెడుతున్నారు. ఇంత జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

చీటీ లేకుండానే..

వైద్యులు రాసిన మందుల చీటీ ఉంటేనే రోగులకు ఔషధాలు విక్రయించాల్సి ఉంది. కానీ కొన్ని మెడికల్ దుకాణాల్లో తమ ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారు. చీటీ లేకుండానే విక్రయాలు చేస్తున్నారు. అమ్మినప్పుడు తప్పనిసరిగా రసీదు ఇవ్వాల్సి ఉండగా ఎవరూ దీన్ని పాటించడం లేదు. నియోజకవర్గంలో చాలా మందుల దుకాణాల్లో కాలం చెల్లిన మందులతో పాటు ప్రభుత్వ అనుమతులు లేని ఔషధాలను విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కాగా ఇటీవల పరిగి నియోజకవర్గంలోని దోమ మండల కేంద్రంలో ఓ ఆర్‌ఎంపీ బాలికకు చికిత్స చేయగా మెడికల్ దుకాణదారుడు కాలం చెల్లిన మందులు విక్రయించడంతో అస్వస్థతకు గురై మృతి చెందింది. దీంతో డాక్టర్, మెడికల్ యజమానిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వైద్యారోగ్య శాఖ అధికారులు ప్రథమ చికిత్స కేంద్రాన్ని సీజ్ చేసి, మెడికల్ దుకాణాన్ని తనిఖీ చేశారు.

నిషేధిత ఔషధాల విక్రయాలు

పరిగి పట్టణ కేంద్రంతో పాటు దోమ, కుల్కచర్ల, పూడూర్ తదితర గ్రామాల్లోని మెడికల్ దుకాణాల్లో ప్రభుత్వం నిషేధించిన మందులను నిర్వాహకులు యథేచ్ఛగా అమ్ముతున్నారు. వాటిని తనిఖీ చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో వారు ఆడిందే ఆట పాడిందే పాటగా తయారైంది. రోగులకు మెడికల్ దుకాణదారులు ఇచ్చిన మందులు వాడటంతో ఆరోగ్యం పూర్తిగా క్షీణిస్తోంది. ప్రజారోగ్య దృష్ట్యా కొన్ని రకాల మందులను నిషేధించింది. కానీ మెడికల్ దుకాణదారులు కాసుల వేటలో పడి వాటిని విక్రయిస్తూ ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.

తనిఖీలు నిర్వహిస్తాం

మెడికల్ దుకాణాలను తనిఖీలు చేసి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటాం. మెడికల్ దుకాణాల్లో తప్పకుండా ఫార్మసిస్టు ద్వారానే మందులను విక్రయించాలి. లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. కాలం చెల్లిన మందులు, అనుమతులు లేని ఔషధాలను విక్రయించరాదు.

– క్రాంతికుమార్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, వికారాబాద్ జిల్లా

అమ్మవారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మండలంలోని పలు ఆలయాలను ఆదివారం దర్శించుకున్నారు. పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలోని లక్ష్మారెడ్డిపాలెం మైత్రీ కుటీర్ కాలనీలో మైసమ్మతల్లి కల్యాణోత్సవంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మజీద్‌పూర్ రెవెన్యూ పరిధిలోని మహామ్మాయిపురంలో మహామ్మాయిదేవి రథోత్సవం, లక్ష్మీనర్సింహా స్వామి కల్యాణోత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సిద్దంకి కృష్ణారెడ్డి, కాలనీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డిలతో పాటు కాలనీవాసులు, నాయకులు పాల్గొన్నారు.

చేవెళ్లలో కాంగ్రెస్ గెలుపునకు కృషి

- మహేశ్వరం ఇన్‌చార్జి కేఎల్లార్
- బీఆర్‌ఎస్ నుంచి హస్తం పార్టీలో భారీగా చేరికలు



కేఎల్లార్, భాస్కర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్), సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం రామకృష్ణాపురం డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు యాదవ్‌రెడ్డి, లింగస్వామిగౌడ్, శ్రీనివాసులు, పగడాల ఎల్లయ్య, శ్యాంసుందర్‌గౌడ్, శ్రీనివాసులుతో పాటు పలువురునాయకులు కేఎల్లార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా గత పదేళ్ల బీజేపీ పాలనలో ప్రజలు విసిగి పోయారన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగిన కాంగ్రెస్ పార్టీని చేవెళ్ల పార్లమెంట్‌లో భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తప్పుడు విధానాలతో ప్రజాస్తులను కార్పొరేట్ కంపెనీలకు దోచి పెడుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు తగ్గిన బుద్ధి చెప్పాలని కోరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో రమేష్, మధుయాదవ్, శంకర్, సుజాతా రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణారావు తదితరులున్నారు. కార్యక్రమంలో నాయకులు గణేష్‌నేత, ఉపేందర్ రెడ్డి, హరినాథ్‌రెడ్డి, మధుసూదన్‌రావు, మహేందర్, రవీంద్ర, సురేశ్, కాళీదాస్,సైదులు, శ్రీకాంత్ రెడ్డి, విష్ణువ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న ఆంజనేయరెడ్డి

పిరమిడ్ స్పిర్చువల్ సంస్థ ప్రచారకార్యదర్శి ఆంజనేయరెడ్డి

కుల్కచర్ల: ప్రజలందరూ ఆరోగ్య సమస్యలు దూరంగా ఉండాలంటే ధ్యానాన్ని అలవర్చుకోవాలని పిరమిడ్ స్పిర్చువల్ సంస్థ ప్రచారకార్యదర్శి అంజనేయరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని చాపలగూడెం, తిరుమలాపూర్, ఇప్పాయపల్లి, రాంపూర్ గ్రామాలలో ప్రజలకు ధ్యానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధ్యానం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతి రోజు అలవాటు చేసుకుంటే గుండె జబ్బులు, బీపీ, షుగర్, కీడ్నీ, సంబంధిత వ్యాధులు రాకుండా దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పిరమిడ్ సంస్థ సభ్యులు వెంకటేశ్, తిరుపతయ్య, శైలజ, శోభిత, పూజ, ప్రదీప్, దీక్షిత, యాదయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గోశాల కార్యక్రమాలు హర్షణీయం



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి



మెథడిస్ట్ చర్చిలో ఎమ్మెల్యేను ఆశీర్వదిస్తున్న చర్చి ఫాదర్

గరుకు స్తంభం ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు టౌన్: తాండూరు గోశాల సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గరుకు స్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గోశాలలో గోమాతకు పూజ చేశారు. అనంతరం గరుకు స్తంభం ప్రతిష్ఠాపనలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గోమాత హిందువులకు ఎంతో పవిత్రమైందన్నారు. గోశాలలో నిర్వహించిన సంప్రదాయ, సాంస్కృతిక పూజా కార్యక్రమాలు హర్షణీయమన్నారు. గరుకు స్తంభం ఏర్పాటు చేయడంతో పితృ దేవతలు స్వర్గానికి వెళ్తారనే నమ్మకం ఉందన్నారు. అలాగే తరతరాలుగా కుటుంబాన్ని వెంటాడుతున్న పాప దోషాల నుంచి విముక్తి పొందవచ్చని చెబుతుంటారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ స్వప్న, మాజీ చైర్ పర్సన్ సునీత, గోశాల సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఈస్టర్ వేడుకల్లో ఎమ్మెల్యే

ఈస్టర్ వేడుకలను పురస్కరించుకుని పట్టణంలోని మెథడిస్ట్ చర్చి, రాజీవ్‌కాలనీలోని నజరేతు ప్రార్థనా మందిరాల్లో ఆదివారం జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్లు ఎమ్మెల్యేను ఆశీర్వదించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు ప్రపంచ శాంతిని కోరుకున్నారని, ఆయన వాక్యాలు ప్రజల సుఖ సంతోషాల కోసమేనన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే ముఖ్యం



మాట్లాడుతున్న డీఎస్పీ

- డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి
- ఇందిరమ్మ కాలనీలో కార్డన్ సెర్చ్



వాహనాలను సీజ్ చేసిన పోలీసులు

అనంతగిరి: శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం అవసరమని డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం వికారాబాద్ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడున్న ఇళ్లను తనిఖీ చేశారు. పలువురి గుర్తింపు కార్డులను పరిశీలించారు. ఇక్కడ ఎన్ని రోజుల నుంచి ఉంటున్నారు తదితర విషయాలపై ఆరా తీశారు. సరైన పత్రాలు లేని 38 బైకులు, 7 ఆటోలు, ఒక కారును సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగానే కార్డన్ సెర్చ్‌లు నిర్వహిస్తామన్నారు. ఇందుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. సీజ్ చేసిన వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు చూయించి తీసుకెళ్లవచ్చన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగితే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐలు రామకృష్ణ, ఆంజనేయులు, డివిజన్ పరిధిలోని 13 మంది ఎస్ఐలు, 3 ఏఎస్‌లు, 10 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 29మంది కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

చేవెళ్ల: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని సీపీఐ కాలనీలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరు మండలం ఎముల నర్వ గ్రామానికి చెందిన అబ్దుల్ షేక్ మహ్మద్(55) భార్య కొన్ని రోజుల కిత్రమే చనిపోయింది. దీంతో ఒంటరిగా ఉంటున్న ఆయన జేపీ దర్గా వద్ద బిక్షాటన చేసేవారు. శనివారం సాయంత్రం మహ్మద్ మద్యం తాగి గదిలోనే పడుకున్నారు. రాత్రి ఆయన ముక్కులో నుంచి రక్తం కారుతూ అనుమానాస్పదంగా మృతి చెందారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి పోస్టుమార్టం కోసం చేవెళ్ల ఆస్పత్రికి తరలించారు.

బీజేపీకి ఓట్లతో బుద్ధి చెప్పాలి



సభలో మాట్లాడుతున్న జంగయ్య

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

మీర్‌పేట: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలంతా తిప్పికొట్టాలని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య కోరారు. సీపీఐ బాలాపూర్ మండల నిర్మాణ మహాసభను ఆదివారం మీర్‌పేట కార్పొరేషన్ లెనిన్‌నగర్‌లోని బుడగ జంగాల కమ్యూనిటీహాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సంపదనంతా అదానీ, అంబానీలకు కట్టబెట్టడంతో పాటు ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కి పేద, మధ్య తరగతి ప్రజలను పేదరికంలోకి నెడుతోందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలంతా ఓట్లతో బీజేపీకి బుద్ధి చెప్పాలన్నారు. కార్య క్రమంలో నాయకులు పానుగంటి పర్వతాలు, చంద్రశేఖర్‌ఎడ్డి, శంకరయ్య, దశరథ, ఛత్యనాయక్, అంజయ్య, రామస్వామి, యాదయ్య, వీరస్వామి, శివ, మహేశ్వరి పాల్గొన్నారు. అనంతరం బాలాపూ ర్ మండల సమితి నూతన కమిటీని ఎన్నుకున్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

తలకొండపల్లి: క్రిమి సంహారక(పురుగు) మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్ చెప్పిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శ్రీశైలం(45) ఇటీవల కుటుంబ కారణాలతో మనోవేదనకు గురవుతున్నారు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయలుదేరి గ్రామ శివారులో ఆయన కౌలుకు తీసుకున్న పొలంలో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆదివారం ఉదయం పొలానికి వెళ్లిన కుటుంబ సభ్యులు విగతజీవిగా పడిఉన్న శ్రీశైలంని గమనించారు. అప్పటికే ఆయన మృతి చెందారు. పక్కన క్రిమి సంహారక మందు డబ్బా ఉంది. ఈ మధ్యనే మృతుడు మానసికంగా బాధపడుతున్నారు. దీంతో ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని స్థానికులు భావిస్తున్నారు. భార్య వెంకటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి ఇద్దరు కుమారులున్నారు.

వ్యక్తి మృతిపై అనుమానాలు

కేసు నమోదు చేసిన పోలీసులు



భిక్షపతి (ఫైల్)

నందిగామ: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నర్సప్పగూడలో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. నందిగామ ఎస్సై గోపాల కృష్ణ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జంగిలి భిక్షపతి అలియాస్ భిక్షమయ్య (45) మద్యానికి బానిసయ్యాడు. శనివారం రాత్రి ఆయన మద్యం తాగి ఇంట్లో మంచంపై నిద్రించారు. అర్ధరాత్రి వేళలో మంచంపై నుంచి కిందపడి చనిపోయాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులు బంధువులకు సమాచారం ఇచ్చారు. దీంతో షాబాద్‌లో ఉన్న ఆయన సోదరుడు జయరాజ్ ఇంటికి చేరుకొని అన్న మృతిపై అనుమానం వ్యక్తం చేశారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

మృతదేహంపై గాయాలు

భిక్షపతి మృతిపై గ్రామస్తులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. మంచంపై నుంచి కిందపడితే పెదవులపై రక్తగాయాలు ఎలా ఉంటాయని, అదే విధంగా గొంతుపై గాట్లు ఎందుకు ఉంటాయనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయమై పోలీసులు సమగ్ర విచారణ చేపట్టినట్లయితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

గంజాయి విక్రేతల అరెస్టు

2.1 కిలోలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాఘవేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: వండర్‌లా సమీపంలో చేతిలో గంజాయి పట్టుకొని తిరుగుతున్న వ్యక్తులను ఆదిబట్ల పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం మధ్యాహ్నం పక్కా సమాచారంతో వండర్‌లా వద్ద ముగ్గురు చేతిలో గంజాయి పట్టుకున్నారని ఆదిబట్ల పోలీసులు దాడి చేశారు. బిహార్‌కు చెందిన వకిల్‌కుమార్(31), పశ్చిమబెంగాల్‌కు చెందిన సబీర్‌గాజీ(24), కోకన్‌గాజీ(30)లను అరెస్టు చేశారు. వారి నుంచి 2.1 కిలోల గంజాయి, మూడు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కేసులో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ రాజు, వెంకటేశ్‌లను సీఐ అభినందించారు.

విద్యుత్ సర్వీస్ వైర్ల అపహరణ

రైతులకు రూ.లక్షన్నరపైగా నష్టం

యాచారం: హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆకులమైలారం గ్రామంలో దుండగులు శనివారం రాత్రి వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ సర్వీస్ తీగలను అపహరించారు. సీఐ నర్సింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకులమైలారం గ్రామంలోని పది మంది రైతులకు చెందిన వ్యవసాయ బావుల వద్ద ఉన్న మోటార్ల సర్వీస్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. వాటి విలువ దాదాపు రూ.లక్షన్నరకు పైగానే ఉంటుందని రైతులు తెలిపారు. వారం క్రితం గ్రామంలో పది మంది రైతుల మోటార్ల సర్వీస్ వైర్లను కూడా అపహరించారు. ఓ మోటార్ సైకిల్‌పై వచ్చిన దుండగులను సమీప రైతులు ఫొటో తీసి పోలీసులకు అందజేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం



మర్పల్లి: పూర్వీకుల సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

- ఘనంగా ఈస్టర్ వేడుకలు
- ప్రత్యేక ప్రార్థనలు చేసిన విశ్వాసులు

తాండూరు రూరల్: మండలంలోని పలు చర్చిల్లో ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం అంతారం, చెంగోల్, ఐనెల్లి, నారాయణపూర్, జినుగుర్తి, కరన్‌కోట్, బెల్కటూర్‌లోని చర్చిల ఆధ్వర్యంలో క్రైస్తవులు తెల్లవారుజామున కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని పాస్టర్లు బోధించారు.

మర్పల్లిలో..

మర్పల్లి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలోని చర్చిల్లో ఆదివారం ఈస్టర్ పండుగను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఉదయం వేళ సామూహిక ప్రార్థనలు చేశారు.



తాండూరు రూరల్: అంతారంలో క్రీస్తు శిలువ వద్ద ప్రార్థనలు చేస్తున్న మహిళలు



తాండూరు రూరల్: చెంగోల్‌లో నృత్యం చేస్తున్న యువతులు